క్లుప్తంగా

అభివృద్ధికి దూరంగా నేరేడుపల్లి



శాయంపేట: మండలంలోని నేరేడుపల్లి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బేరుగు రాకేష్ ఆరోపించారు. నేరుడుపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడారు. నేరుడుపల్లిలో గ్రామం పారిశుద్య విపరీతంగా సమస్య ఉందన్నారు. ప్రస్తుత పాలకులు నేరుడుపల్లిలో ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదని, పాత పనులకే శంకుస్థాపనలు చేసి భుజాలు తడుముకుంటున్నారని ఎద్దేవా చేశారు. మార్పు కోసం ప్రజలు ఓట్లేస్తే మోసపోయారని, ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో భోగి ఇజిగిరి, బలంతుల యుగేందర్, భోగి రామ్, ముష్కే మల్లేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



శాయంపేట: మండల కేంద్రానికి చెందిన బాసాని చంద్రప్రకాశ్ తల్లి బాసాని అహల్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో చంద్రప్రకాశ్‌తోపాటు 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం చంద్రప్రకాశ్‌ను పరామర్శించారు. రూ.11,000 అందజేశారు. కార్యక్రమంలో సంతోష్, సుమన్, భాస్కర్, ఈదేందర్, రాజేందర్, సూర్యప్రకాష్, శ్రీను, అంకూషావళీ, భిక్షపతి ఉన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

కమలాపూర్: దివ్యాంగులు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికుల పింఛన్ల పెంపు కోసం ఈ నెల 8న (సోమవారం) నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి, కమలాపూర్ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4 వేలుగా ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు, రూ.2 వేలుగా ఉన్న వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికుల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ అధికారం చేపట్టి 20 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చలేదని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే పింఛన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగే కలెక్టరేట్ ముట్టడికి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

ఎన్నిక



కమలాపూర్: కమలాపూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా మేడిపెల్లి రాంబాబు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు, కులస్తులు ఆదివారం స్థానికంగా సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పెరుమాండ్ల గోపాల్‌గౌడ్, కోశాధికారిగా కూనూరు రవిగౌడ్, డైరెక్టర్లుగా జక్కు బాలరాజుగౌడ్, పర్కాల రవీందర్‌గౌడ్, పబ్బు ఓదెలుగౌడ్, పెరుమాండ్ల రాజుగౌడ్, పబ్బు భిక్షపతిగౌడ్, జేరుపోతుల లక్ష్మీనారాయణగౌడ్, కారోబార్‌గా కుమారస్వామిగౌడ్ ఎన్నికయ్యారు.

'వేయిస్తంభాల'లో ఎన్‌సీసీ కేడెట్లు

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయాన్ని బిహార్, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఆదివారం సందర్శించారు. మామునూర్ పోలీస్ శిక్షణ కళాశాలలో ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ –1 కార్యక్రమం 12రోజుల క్యాంపులో భాగంగా జాతీయ సమైక్యత శిబిరంలో మూడు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఓరుగల్లు నగరంలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించినట్లు ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ క్యాంపు డిప్యూటీ కమాండెట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ అధికారులు, ట్రైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి..

రామన్నపేట: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదిగి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఏవీవీ విద్యాసంస్థల శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్ సూచించారు. పాఠశాల 2008 – 09 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.

చెత్తకుప్పలు.. జనాల తిప్పలు

- మందుబాబులకు అడ్డాగా డంపింగ్ యార్డులు
- చెత్త కాలబెడుతున్న సిబ్బంది

శాయంపేట : ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను కుప్పలుగా పోసి కాల్చడం.. లేదంటే మండల కేంద్రంలోని దేవుని చెరువులో పడేస్తుండడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డులు మందుబాబులకు అడ్డగా మారి.. తాగి పడేసిన సీసాలు, గ్లాసులతో దర్శనమిస్తున్నాయి. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా తయారుచేసి విక్రయించడం ద్వారా గ్రామాలకు లాభాలు సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం డంపింగ్ యార్డులను నిర్మించింది. చెత్త సేకరణకు ప్రతి గ్రామానికి ట్రాక్టర్లను, ఆటో ట్రాలీలను సమకూర్చడంతో పాటు మల్టీపర్పస్ వర్కర్లను నియమించింది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది. తడి, పొడి చెత్తను సేకరించి కుప్పలుగా పోసి కాల్చడంతో పర్యావరణం దెబ్బతింటుంది. మండలంలోని మాందారిపేట శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో చెత్తను కుప్పలుగా పోయడంతో వాహనదారులు ఆ దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. అధికారులు సైతం దృష్టిసారించకపోవడంతో డంపింగ్ యార్డులు అలంకారప్రాయంగా కనిపిస్తున్నారు. మండల కేంద్రంలోని మైలారం రోడ్డులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లో తడి, పొడి చెత్తను వేయకుండా దేవుని చెరువు శిఖంలో చెత్త పోస్తుండడంతో డంపింగ్ యార్డు నిరుపయోగంగా మారి మందు



మాందారిపేటలో రోడ్డు పక్కనే కాలుతున్న చెత్త

బాబులకు అడ్డగా మారింది.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

చెత్తను సేకరించి ఎరువు తయారుచేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం.. కానీ, డంపింగ్ యార్డులు మందుబాబులకు అడ్డాగా మారడం.. చెత్తను కాల్చడంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారుతున్నాయి. యార్డులు నిరుపయోగంగా ఉండడంతో మండల కేంద్రంలో రోడ్డు పక్కనే చికెన్ వ్యర్థాలను పడేయడంతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి చెత్తను వృథాగా పోనియకుండా సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకుంటే గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.



నిరుపయోగంగా ఉన్న మాందారిపేట డంపింగ్ యార్డు



శాయంపేట డంపింగ్ యార్డులో దర్శనమిస్తున్న ఖాళీ మద్యంబాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు



కఠిన చర్యలు తీసుకోవాలి

దేవుని చెరువులో చెత్త, చికెన్ వ్యర్థాలను వేయడంతో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్వాసన వల్ల గుడికి వచ్చే భక్తులు ఇబ్బందిపడుతున్నారు. చెత్త, చికెన్ వ్యర్థాలను చెరువు శిఖంలో వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాజుకుమార్, ఆలయ పూజారి

ఫొటోగ్రాఫర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- పరకాల ఎస్సై విఠల్

పరకాల: పోటీ ప్రపంచంలో నూతన సాంకేతికతను ఫొటోగ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని పరకాల ఎస్సై విఠల్ అన్నారు. ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో ను ఫొటో గ్రాఫర్స్ విజయవంతం చేయాలని ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాడి రవీందర్‌రెడ్డి కోరారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఎక్స్‌పో బ్రోచర్‌ను పరకాల అమరధామంలో ఆదివారం ఎస్సై విఠల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతూ నూతన సాంకేతికతతో ముందుకెళ్తుందన్నారు. లైటింగ్ పరికరాలు, ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్స్, ప్రింటింగ్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాడి రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు చందర్, రూరల్ అధ్యక్షుడు కనుకుంట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బండారి గిరిప్రసాద్, రమేష్, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రాజు, సుదీర్, కోశాధికారి గూడెల్లి శివకుమార్, సుధాకర్, నారాయణ, వెంకటేష్, ప్రభాకర్, సుమన్, రాజేందర్, సాయి, రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై విఠల్, అసోసియేషన్ నాయకులు

ఫ్లెక్సీలు చింపిన గుర్తుతెలియని వ్యక్తులు

- పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ స్టేజీ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీతోపాటు దర్గా దగ్గర ఉన్న ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ దాసి శ్రావణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ గోవిందాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్ర రాజు ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో కూడా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ప్రారంభించిన సీసీ రోడ్డు శిలాఫలకాన్ని పగలగొట్టగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను చింపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



గుర్తు తెలియని వ్యక్తులు చింపిన ఫ్లెక్సీ

వర్షంలోనూ.. యూరియా కోసం



ఊరుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం ఎదుట రైతుల క్యూ

- బారులుదీరిన రైతులు

దామెర: యూరియా కోసం వర్షాన్ని సైతం లెక్కచేకుండా రైతులు లైన్లో నిల్చున్నారు. మండలంలోని ఊరుగొండ(పెద్దాపూర్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియా బస్తాల పంపిణీ కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న రైతులు ఆదివారం తెల్లవారుజామున వర్షం కురుస్తున్నప్పటికీ ఊరుగొండకు చేరుకొని క్యూ కట్టారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డులతో రైతులు గంటల తరబడి క్యూలో నిలబడి యూరియా బస్తాలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులను క్రమ పద్ధతిలో పంపించేందుకు ఎస్సై కొంక అశోక్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రేవంత్‌రెడ్డి, కడియం శ్రీహరి నమ్మించి మోసం చేశారు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు: రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిది అయితే, నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన ఘనత కడియం శ్రీహరికే దక్కుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. కాల్వల్లో నీరు లేక.. యూరియా దొరకక రైతులు అరిగోసలు పడుతుంటే కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని వెంకటాపూర్ గ్రామం నుంచి నష్కల్– ఉప్పుగల్లు రిజర్వాయర్ వరకు స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తలపెట్టిన రెండో విడత రైతన్న కోసం రాజన్న పాదయాత్రను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ఉప్పుగల్లు, చెన్నూర్, పాలకుర్తి రిజర్వాయర్లకు రూ.300 కోట్ల ఎస్టిమేషన్ వేస్తే 2 సంవత్సరాలు కూడా నిండని కాంగ్రెస్ నాయకులు రూ.1,000 కోట్లకు రీ ఎస్టిమేషన్లు వేశారంటే కమీషన్ల కోసం వారు ఎంత అవినీతికి పాల్పడుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్‌కు ఎందుకని ఓటు వేశామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారన్నారు. ఓటు కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను స్థానిక ఎన్నికల్లో ఉరికించి కొట్టాలని అన్నారు. ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తినుంచి వచ్చిన కడియం శ్రీహరి పదిమందికి ఆదర్శంగా నిలవాల్సింది పోయి మోసం చేసి తానే విలువ కోల్పోయాడని అన్నారు. రాజయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా ఆపేసిందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసమే పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. వెంకటాపూర్, గుంటూర్ పల్లి, మల్లక్‌పల్లి, ధర్మపురం మీదుగా నష్కల్ –ఉప్పుగల్ రిజర్వాయర్ వద్దకు చేరుకుని నీటిని కళ్లకు అద్దుకోవడంతో యాత్ర ముగిస్తుందని తెలియజేశారు. పాదయాత్ర సందర్భంగా పత్తి, మక్కజొన్న చేన్లను సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరతతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తంపుల మోహన్, ఉస్మాన్ అలీ, కట్కూరి రాజు పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న దయాకర్‌రావు

సురక్ష సేవాసమితి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

పరకాల: సామాజిక సేవ కార్యక్రమాలే లక్ష్యంగా సురక్ష సేవా సమితిని స్థాపించినట్లు ఆ సేవా సమితి అధ్యక్షుడు రాపర్తి సారంగపాణి అన్నారు. పరకాల మండలంలోని కామారెడ్డిపల్లెలో సురక్ష సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వరంగల్‌లోని ప్రముఖ ఆస్పత్రి అజరా , లయన్స్ క్లబ్ సహకారంతో 200 మందికి ఉచిత వైద్యపరీక్షలు చేపట్టి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురక్ష సేవా సమితి కార్యదర్శి సామల ప్రభాకర్, కోశాధికారి ఎక్కటి రాజిరెడ్డి, వైద్యులు రాపర్తి సురేష్, కంది ప్రశాంత్‌రెడ్డి, సమర్థరెడ్డి, పావనిరెడ్డి, సామల ప్రవీణ్, కోడెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యుడు

బాధిత కుటుంబాలకు నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న వినోద్‌కుమార్



పరామర్శిస్తున్న రవీందర్‌రావు

నడికూడ: మండలంలోని చౌటుపర్తి గ్రామానికి చెందిన వేల్పుల రమేష్ కుమార్తె శృతి(అడ్వకేట్)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. వినోద్ వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సహోదర రెడ్డి, మేడిపల్లి శోభన్, మండల అధ్యక్షుడు చందు, లింగమూర్తి, రవీందర్, నాగిరెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

ఐనవోలు మండల కేంద్రంలో..

ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ అనుముల నర్సిరెడ్డి తల్లి అనుముల లసుమమ్మ అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

రూ.10 నోటు @ రూ.2,516

- వేలంలో దక్కించుకున్న భక్తుడు

హన్మకొండ: రూ.10 కరెన్సీ నోటు విలువ రూ.2,516 ఏమిటని ఆశ్చర్యపోతున్నారా..? అవును ఇది నిజం. రూ.10 నోటును రూ.2,516కు వేలంపాటలో దక్కించుకున్నాడో భక్తుడు. వివరాల్లోకి వెళ్తే... హనుమకొండ కేఎల్ఎస్ రెడ్డి కాలనీలోని రామకృష్ణ సేవా సమితి భవనంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా రూ.10 విలువగల 21 నోట్లతో కూడిన మాలను వినాయకుడికి సమర్పించారు. నవరాత్రుల పాటు పూజలందుకున్న ఆ నోట్లను బంగారు నోట్లుగా భావిస్తారు. లడ్డూను చేజిక్కించుకోవడానికి భక్తులు వేలంలో ఎలా పోటీ పడతారో అలాగే, రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో రూ.10 నోట్ల కోసం భక్తులు అలాగే పోటీ పడ్డారు. మొత్తం 21 రూ.10 నోట్లకు వేలం నిర్వహించగా అత్యధికంగా ఒక నోటు రూ.2516, అత్యల్పంగా రూ.351 వేలంపాట పాడారు. హనుమకొండ అశోక కాలనీకి చెందిన ఎక్కటి కృష్ణారెడ్డి రూ.2,516కు బంగారు నోట్ దక్కించుకున్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలోని లెనిన్‌నగర్ కాలనీలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను స్థానిక కార్పొరేటర్ గుండు చందనతో కలిసి చిప్ప వెంకటేశ్వర్లు, డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ కంచ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 600 కుటుంబాలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు అశోక్‌బాబు, నరేష్, రాజేందర్, ప్రభాకర్‌రెడ్డి, సురేష్ బాబు రత్నాకర్, చిన్నాల సత్యనారాయణ, ప్రసాద్, కిరణ్, వేణు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయం మూసివేత

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రాన్ని ఆదివారం మధ్యాహ్నం ఆలయ అర్చకులు మూసివేశారు. చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం దర్శనాలు నిలిపివేసి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసి తాళాలు వేశారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్

కమలాపూర్: యాదవ కులస్తుల కోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంక సంపత్ యాదవ్, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పాక శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన యాదవ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ భవన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. గొర్లకాపరులకు ప్రమాద బీమా వర్తింపజేయాలని తెలిపారు. అనంతరం యాదవ మహాసభ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బంక సంపత్ యాదవ్ వెల్లడించారు. అధ్యక్షుడిగా సల్వాల శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పాక చంద్రమౌళి యాదవ్, ఉపాధ్యక్షులుగా పాక రవీందర్ యాదవ్, మొర్రి ఓదెలు యాదవ్, బాషబోయిన రమేష్ యాదవ్, గడల కొంరయ్య యాదవ్, అట్ల చంద్రమౌళి యాదవ్, కార్యదర్శులుగా దుండ్ర గోపాల్ యాదవ్, దద్దు కుమారస్వామి యాదవ్, వంగ రాజ్‌కుమార్ యాదవ్, కసరబోయిన రాజయ్య యాదవ్, ఎల్లబోయిన రవీందర్ యాదవ్, ప్రచార కార్యదర్శిగా ఎర్రగొల్ల రవి యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా మేకల రవియాదవ్ ఎన్నికయ్యారు. యూత్ విభాగం మండల అధ్యక్షుడిగా బోయిని శ్రావణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రగొల్ల రజనీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కొడాలి అరుణ్ యాదవ్, దొంగల సుమన్ యాదవ్, వంగ రాజ్‌కుమార్ యాదవ్, ప్రచార కార్యదర్శిగా వంగ రమేష్ యాదవ్ ఎన్నికయ్యారు.



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, పాక చంద్రమౌళి

పలువురికి అవార్డుల ప్రదానం



దినకర్‌కు అవార్డు అందజేస్తున్న క్లబ్ బాధ్యులు



రవీందర్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్‌కు రోటరీ క్లబ్.. నేషన్ బిల్డర్ అవార్డు ప్రదానం చేసింది. హనుమకొండలోని వాగ్దేవి కళాశాలలో ఆదివారం నిర్వహించిన గురుపూజోత్సవంలో దినకర్‌కు అవార్డు అందజేసినట్లు రోటరీ క్లబ్ హనుమకొండ అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, కార్యదర్శి నరేష్ తెలిపారు.

రవికుమార్‌కు జాతి నిర్మాత పురస్కారం

హన్మకొండ: జాతి నిర్మాత పురస్కారాన్ని నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పలివేల్పుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ అందుకున్నారు.

నవరసకళా పురస్కారం ప్రదానం

హన్మకొండ కల్చరల్: శాంతి కృష్ణ సేవా సమితి వరంగల్ ఆధ్వర్యంలో సేవారత్న, కళాపోషకుడు డాక్టర్ ఆడెపు రవీందర్, జేబీ కల్చరల్ సొసైటీ నిర్వాహకుడు, కాస్ట్యూమ్, మేకప్ ఆర్టిస్ట్ జడల శివ, తదితరులకు కాకతీయ కళా వైభవం నవరసకళా పురస్కారాలను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేంద్రశర్మ అందజేశారు.

పోరాటానికి నిలువెత్తు రూపం 'రావి'




నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం రావి నారాయణ రెడ్డి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు కొనియాడారు. హనుమకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రావి నారాయణ రెడ్డి 34వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిరబోయిన కరుణాకర్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎంఏ.స్టాలిన్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, శంకర్‌నాయక్, వేల్పుల సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

11నుంచి రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు


వరంగల్ చౌరస్తా: భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ (యూ) నగర కమిటీ సమావేశాన్ని ఎగ్గని మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1946 నుంచి 1952 వరకు సాగిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఎర్రజెండా నాయకత్వాన నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడినట్లు చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్, సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పెద్దారపు రమేష్

నేత్రదానంపై అవగాహన అవసరం

ఖిలా వరంగల్: నేత్రదానంతో మరొకరికి చూపును ప్రసాదించవచ్చని, ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా ఖిలా వరంగల్ పడమర కోట పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ నేత్ర, అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో నేత్రదానంపై మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ దానంలో దేశంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని అన్నారు.



అవగాహన కల్పిస్తున్న అశోక్